క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



నారాయణపేట: ఫిర్దోస్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో ఆదివారం జిల్లా కేంద్రంలోని మసీదు ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న డాక్టర్ బదర్ మహ్మద్ జహీర్ వైద్య శిబిరం పాల్గొని వివిధ వ్యాధులతో బాధపడుతున్న దాదాపు 200మందికి ఉచిత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ ఖాసీం, భాగంగ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మరికల్: మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మాత్య మూర్తి లంబడి నాగమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలను మండల అధ్యక్షుడు లంబడి తిరుతపయ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రామస్వామి, గోవర్దన్, సంపత్, రాజవర్ధన్‌రెడ్డి, సురేఖ, మల్లేష్, ఉస్సేన్, గోపాల్, బాలకృష్ణ పాల్గొన్నారు.

పంటకు నష్టపరిహారం ఇవ్వాలి

మరికల్: యాసంగిలో ఆకాల వర్షాలతో దెబ్బతిన్న వరి పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ నాయకులు వేణు, రమేష్, బాల్‌రాజ్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వరిపంటల కోత దశలో కురిసిన వర్షాల కారణంగా చాలామంది రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. దీంతో ఎకరాకు రూ. 15వేలకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. బాధిత రైతులను ప్రభుత్వం ఎకరాకు రూ. 10వేలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

నిలిచిన భవన నిర్మాణ పనులు



మరికల్: మండల కేంద్రంలోని అన్ని హంగులతో నిర్మాణం కొనసాగుతున్న మండల కాంప్లెక్స్ పనులకు బిల్లులు సకాలంలో రాక పనులు నిలిచిపోయాయి. రూ. 7.50 కోట్ల నిధులతో నిర్మాణం చేపడుతున్న మండల కార్యాలయ పనులకు ఇప్పటివరకు కేవలం రూ. 2కోట్లు మాత్రమే మంజూరు కావడంతో లేబర్‌కు కూలీ డబ్బులు ఇచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిర్మాణపనులు పూర్తిగా నిలిచిపోవడంతో కూలీలు సైతం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేసి త్వరగా నిర్మాణ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



ధన్వాడ: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన భగద్గీత కంఠస్థ పోటీలలో మండలంలోని శ్రీ సాయిసరస్వతీ విద్యామందిర్ పాఠశాలకు చెందిన మధుస్విని ప్రాథమిక స్థాయిలో ప్రథమ బహుమతి అందుకుందని కరస్పాండెంట్ నారాయణ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో మొత్తం 18జిల్లాల నుంచి 98మంది పాల్గొనగా ఇందులో ప్రథమ బహుమతిని గెలుపొందిందని విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి గుమ్మల సత్యం చేతులమీదుగా బహుమతి అందుకున్నట్లు తెలిపారు.

మేనిఫెస్టో అమలు చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కార్మికుల మేనిఫెస్టో ద్వారా ఆ వర్గాలకు మేలు జరుగుతుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా స్కీం వర్కర్లైన అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మున్సిపల్, గ్రామ పంచాయితీ వర్కర్ల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు కిల్లెగోపాల్, కురుమూర్తి, దీప్లానాయక్, సత్తయ్య పాల్గొన్నారు.

రాయితీ పరికరాలు ఏవీ?

- కనుమరుగవుతున్న సబ్సిడీ పథకాలు
- ప్రతీ ఏడాది తగ్గుతున్న సబ్సిడీ యంత్రాలు
- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు



ట్రాక్టర్‌తో కరిగెట దున్నుతున్న రైతు (ఫైల్)

మాగనూర్: ఆధునిక వ్యవసాయం వైపు రైతుల అడుగులు ముందుకు పడడం లేదు. వ్యవసాయ సాంకేతికత, యంత్రీకరణ పరిజ్ఞానం ఆశించిన స్థాయిలో రైతులకు చేరడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో వ్యవసాయశాఖ చేస్తున్న ప్రచారం కార్యరూపం దాల్చడం లేదు. వ్యవసాయ రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా ఆటకెక్కుతున్నాయి. దీంతో రైతన్న ఆశలపై నీళ్ల చల్లుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదేవిధంగా వ్యవసాయ యంత్రీకరణ పథకాల మంజూరును ప్రభుత్వం పక్కన పెట్టడంతో పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సబ్సిడీపై అందజేసే యంత్రాలకోసం రైతన్నలు ఎదురుచూస్తున్నారు.

అందని ద్రాక్షగా పనిముట్లు..

ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలంలో మొత్తం 29గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే పథకాలు, సబ్సిడీ పరికరాలు ప్రభుత్వం అందించేది. రోటోవేటర్, కల్టివేటర్, తైవాన్, స్ప్రేలు, మినీట్రాక్టర్లు, టార్పాలిన్ కవర్లు, వ్యవసాయ పనిముట్లు ప్రభుత్వం పంపిణీ చేసేది. ప్రస్తుతం రాయితీపై అందజేసే పనిముట్లు అందని ద్రాక్షగా మారింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

నిలిచిపోతున్న పథకాలు..

వ్యవసాయశాఖ రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా 2006–07 నుంచి నిలిచిపోతున్నాయి. సేద్యంలో రైతులకు ఎక్కువగా ఉపయోగపడే నాగళ్లు, ఇతర పనిముట్లు 2014లో నిలిచిపోయాయి. ఈ కారణంగా పత్తి చేనులల్లో ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. 2016–17 ఆర్థిక సంవత్సరం వరకు అందుబాటులో ఉన్న 10నుంచి 12రకాల పనిముట్లు ఆ తర్వాత కనుమరుగు అయ్యాయి. దీంతో రైతన్నలకు అత్యవసరమైన పరికరాలు రాయితీలపై అందకుండా పోతున్నాయి. తప్పనిసరి పరిస్థితిలో రెట్టింపు ఖర్చుచేసి రైతులు మరింత అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు.

మంజూరు అంతంత మాత్రమే..

యంత్రీకరణ రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా నిలిపోతుండగా మరోపక్క మంజూరయ్యే యూనిట్లు కూడా నామమాత్రంగా ఉంటున్నాయి. తైవాన్ స్ప్రేయర్‌లకు మంగళం పాడిన వ్యవసాయ శాఖ వాటి స్థానంలో గతేడాది రిచార్జి స్ప్రేయర్‌లను అంతంత మాత్రమే మంజూరు చేసింది. రైతులకు నిత్యావసరంగా మారింది. టార్పాలిన్ కవర్లు కూడా చాలా వరకు తగ్గిపోయాయి. ఇన్నేళ్లుగా కొనసాగిన వ్యవసాయ యంత్రీకరణ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పరికరాలు అందజేయాలి..



ప్రభుత్వం ప్రతి ఏడాది సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేసేది. ఈ ఏడాది మాత్రం పరికరాలు అందజేయడం లేదు. దీంతో వ్యవసాయానికి అవసరమైన పనిముట్లను ప్రైవేట్ దుకాణంలో కొనుగోలు చేస్తున్నాం. ధర అధికంగా ఉండటంతోపాటు నాణ్యత లేకుండా ఉంటున్నాయి. ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలు అందజేయాలి.

– రాజు, రైతు మాగనూర్

రైతులకు ఇబ్బందిగా ఉంది..



ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే పనిముట్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బయట ప్రైవేట్‌లో అధిక ధర పెట్టి కొనుగోలు చేయలేకపోతున్నాం. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేయాలి.

– వెంకటప్ప, రైతు వర్కూర్

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



ప్రభుత్వం నుంచి వ్యవసాయశాఖ ద్వారా రైతులకు రావాల్సిన సబ్సిడీ పరికరాలు అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. గత సంవత్సరం కొంత మేర వచ్చిన పరికరాలను రైతులకు అందజేశాం. రైతులు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– సుదర్శన్‌గౌడ్ ఇన్‌చార్జి ఏఓ, మాగనూర్

ఎమ్మెల్యేకు సన్మానం



నర్వలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రేషన్‌డీలర్స్

నర్వ: ఎమ్మెల్యేగా ఎంపికైన వాకిటి శ్రీహరిని మండల రేషన్ డీలర్లు ఆదివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు. ప్రజలకు ప్రభుత్వం అందించే సరుకులను సకాలంలో అందించి వారికి ఉత్తమ సేవలనందించాలని రేషన్ డీలర్‌లకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్‌రాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటయ్య, ఉమాపతిరెడ్డి, జలంధర్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మన్యపురెడ్డి, రాములు, వెంకటకృష్ణారెడ్డి, అంపయ్య పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలానికి చెందిన జలసాధన సమితి సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని శాలువ, శాలువాతో సన్మానించారు. జల సాధన సమితి కో కన్వీనర్ నర్సింహ మాట్లాడుతూ.. జీవో నంబర్ 69ని అమలుచేసి నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరందించాలని కోరారు. పెద్దజట్రం ఎంపీటీసీ కిరణ్‌కుమార్, సభ్యులు తిరుపతి, వెంకటప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చిత్రపటం బహూకరణ

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువనాయకుడు దాసరి భాస్కర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన వాకిటి శ్రీహరికి ప్రత్యేకంగా తయారుచేసిన ఆయన చిత్రపటాన్ని ఆదివారం ఆయన నివాసంలో బహూకరించారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆనంద్‌గౌడ్, శివరాంరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో 2009–10 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. తమ గురువులతో సమావేశమై గత 13 ఏళ్లుగా కొనసాగుతున్న తమ అనుబంధాలను, చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం బాలాజీ, ఉపాధ్యాయులు శంభులింగం, నాగార్జున్‌రెడ్డి, కన్నప్ప, సత్యనారాయణ, విద్యార్థులు భూపాల్‌రెడ్డి, రాజు, దస్తగిరి, అనిల్, ఉషేనప్ప, వెంకటప్ప పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజలో పడి వెలిగిస్తున్న అయ్యప్పస్వాములు

మద్దూరు: మండలంలోని గొకుల్‌నగర్ గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన స్వామివారి మహాపడిపూజ వైభవంగా కొనసాగింది. ఉదయాన్నే స్థానిక శివాలయం వద్ద అయ్యప్పస్వామి కలశపూజ నిర్వహించి గ్రామంలోని పురవీధుల గుండా స్వాములు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పకలం అయ్యప్పకు అభిషేకం, వినాయకుడికి, కుమారస్వామికి అష్టోత్తరాలచే పూజలు చేశారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, పసుపాభిషేకాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, నాగులు గురుస్వాముల ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి.

నేడు మహాపడి పూజ

ధన్వాడ: మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్పస్వామి మహాపడి పూజ నిర్వహిస్తున్నట్లు గురుస్వాములు గోవర్ధన్‌గౌడ్, ఉమేష్, వేణు తెలిపారు. స్వామివారిని 18 మెట్లతో పుష్పలతో అలంకరించి అభిషేకం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల అయ్యప్ప మాలధారులు పాల్గొనాలని కోరారు.

పంటలకు అడవిపందుల బెడద



మరికల్: అడవి పందుల నుంచి కోతకు వచ్చిన వేరుశనగపంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు రైతులు రాత్రి బవుళ్ల పంటలకు రక్షణగా ఉంటు కంటికి రెప్పల అడవిపందుల బెడద నుంచి పంటలను రక్షించుకుంటున్నారు. మరికొందరు రైతులు పంటల చుట్టు చీరలను చుట్టి కాపాడుకుంటున్నారు.

ఉత్సాహంగా కరాటే చాంపియన్‌షిప్



పతకాలు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం బోయపల్లిగేటు సమీపంలో శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 2వ జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించారు. ఈ పోటీలకు హైదరాబాద్‌తోపాటు ఉమ్మడిజిల్లాలోని పలు ప్రాంతాలు, ఇతర జిల్లాలకు చెందిన దాదాపు 250 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. కుమితే, కతాస్ విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఆత్మరక్షణ కోసం కరాటే విద్య ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ కరాటే విద్యార్థులను అభినందించారు. అనంతరం ప్రతిభచాటిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్గనైజర్ మాస్టర్ కె.వెంకటేశ్, సీపీఐ పట్టణ ఉపాధ్యక్షుడు కోటకదిర నర్సింలు, మాస్టర్లు కుమార్, ఎతినె చెన్నయ్య, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్య ఉద్యమాలు



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అన్ని సంఘాలను కలుపుకొని ఐక్య కార్యాచరణ ఉద్యమాలు చేయాలని నిర్ణయించామని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య తెలిపారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు డి.వెంకట్రాములు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్మయ్య మాట్లాడుతూ దళితులపై దాడులు, హత్యలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఇక భూ సమస్యల పరిష్కారంపై దళితులు అధికారులకు విన్నవించుకున్నా లాభం లేకుండా పోతోందన్నారు. జనవరి 3న ప్రతి మండల కేంద్రంలో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగం– దళితులు అనే అంశంపై జిల్లా సెమినార్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ పాల్గొంటారని అన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, లక్ష్మీదేవి, పాతూరు వేణు, మొగులయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మరికల్: కొత్త ప్రభుత్వం వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని వాల్మీకి సంఘం జిల్లా నాయకులు నర్సింహులు, చంద్రప్ప, రాములు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. దశాబ్దాలుగా బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఉద్యమించిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత తమ బతుకులు మారడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బోయలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేయాలన్నారు.

పెన్షన్ రిటైర్డ్ ఉపాధ్యాయుల ఆత్మగౌరవం

దామరగిద్ద: వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులు ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం కల్పించిన హక్కు పెన్షన్ అని రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. ఆదివారం పెన్షనర్స్ డే సందర్భంగా స్థానిక సంజీవరాయ ఆలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వివిధ విభాగాల రిటైర్డ్ ఉద్యోగులు నారాయణ, చంద్రారెడ్డి, మనోహర్, వెంకటప్ప, బసిరెడ్డి పాల్గొన్నారు.

అయోధ్య నుంచి కోయిల్‌కొండకు చేరిన శ్రీరామస్పర్శ అక్షింతలు



కోయిల్‌కొండ: అయోధ్య నుంచి అక్షింతలు వచ్చిన సందర్భంగా ఆదివారం మండలకేంద్రంలో ఆదిఆంజనేయస్వామి ఆలయం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మండలంలోని 44 గ్రామపంచాయితీలకు అంక్షితలు పంపిణీ చేస్తామని అర్చకులు రాఘురామాచారి, రాఘవేందర్‌రావులు తెలిపారు.

రోడ్డును బాగుచేయండి



కంకర తెలిన రహదారి

మరికల్: మండలంలోని తీలేర్ నుంచి పూసల్‌పహాడ్ వెళ్లే రహదారిని బాగుచేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్డుపై కంకర తెలడంతో వాహనాలు, బైక్‌లు నడిపించాలంటే ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన తమ గోడు ఎవరు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే స్పందించి తీలేర్, పూసల్‌పహాడ్ మధ్య ఉన్న రోడ్డును బీటీ రోడ్డుగా మంజూరు చేయాలని కోరుతున్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు



వృథాగా పారుతున్న భగీరథ నీరు

మాగనూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథాగా పోతుందని కాలనీవాసులు వాపోతున్నారు. వారం రోజులుగా పైపులైన్ లీకేజీ ఏర్పడిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు తెలిపారు. లీకేజీ నీటితో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.

రూ.30 వేలు చోరీ

మక్తల్: బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడిని బెదిరించి అతడి వద్ద ఉన్న రూ.30 వేలు ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు.. మాగనూర్ మండలం ఉజ్జెల్లికి చెందిన కార్తీక్ అనే యువకుడు మక్తల్‌లోని అంజలి ల్యాబ్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో నారాయణపేట క్రాస్‌రోడ్డులో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏటీఎం నుంచి రూ.30 వేలు డ్రా చేసుకొని సంగంబండ వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు మంకి క్యాప్‌లు ధరించి వెనుక బైక్‌పై వెంబడించి ఢీకొట్టి కిందపడేశారు. అనంతరం అతడి గొంతుకు తాడు బిగించి జేబులో ఉన్న రూ.30 వేలు తీసుకొని పరారయ్యారు. కాసేపటికి కోలుకున్న కార్తీక్ వెంటనే గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా మక్తల్‌లో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంట్లోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తి మహిళ ముక్కుపుడకను అపహరించారు. సీఐ రాంలాల్ విషయం తెలియగానే గాలింపు చర్యలు ముమ్మరంగా చేశారు.

19న భగవద్గీత కంఠస్థ పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 19న జిల్లాస్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6, 7, 8. 9 తరగతుల విద్యార్థులకు 1 నుంచి 30 శ్లోకాలపై, 18 ఏళ్ల లోపు, 18 ఏళ్లు నిండిన వారికి సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు.

కరాటేలో కింగ్‌షోటో కాన్‌కు పతకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలో ఆదివారం జరిగిన సౌతిండియా కరాటే పోటీల్లో జిల్లా కేంద్రంలోని కింగ్‌షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో కటాస్ విభాగాల్లో మల్లేష్, మహ్మద్ అవేజ్, మారియబేగం, మహ్మద్ సాబీర్‌పాష బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు నిహాన్ షోటోకాన్ గ్రాండ్ మాస్టర్ రవీందర్‌కు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

బస్టాండ్ ఆవరణలో గ్యార్మీ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. ముందుగా ఫాతేహాలు నిర్వహించి దాదాపు 1500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ.వెంకటేశ్ ప్రారంభించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ మాట్లాడుతూ తమ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఏటా కులమతాలకతీతంగా అన్ని పండుగలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూనియన్ నాయకులు రాములుయాదవ్, హాష్మి, వినయ్‌కుమార్, శ్రీను, ఆంజనేయులు, లింగం, ఆలం, రాజు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న ఎన్‌పీ వెంకటేశ్